
# వైసీపీ కి బాలినేని రాజీనామా!



- నేడోరేపో జనసేన లో చేరే అవకాశం

RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
సెప్టెంబర్ : 19 గురువారం సంపుటి : 28 సంచిక : 224

# ఆయన చెప్పారంట..! ఈయన చేశారంట.....!!

(అగ్ని ప్రతినిధి, మార్కాపురం) ఎర్రగొండపాలెం మండలంలో వర్గ పోరు మొదలైంది. వర్గ పోరు అనేది ఇరు పార్టీల మధ్య ఉంటుంది, కానీ తమాషాగా పట్టణంలో వర్గ పోరు కేవలం తెదేపా వర్గాల మధ్యనే జరుగుతుంది.మండలంలోని మిల్లంపల్లి పంచాయతీలో నీటి ట్యాంకర్ల విషయమై తెదేపాలో ప్రముఖంగా ఉన్న డాక్టర్ మన్నె రవీంద్ర ఫ్లెక్సీ వేయడం తోనే ఈ ఘర్షణలకు కారణమైంది. డాక్టర్ మన్నె రవీంద్ర ఫ్లెక్సీ వేయవద్దు అని మరొక వర్గం ఆయన ఫ్లెక్సీలను చించి వేయడమే కాక ట్యాంకర్ల లో పురుగు మందులు కలిపిన వైనం బయటపడింది. ఈ విషయమై సంబంధిత తెదేపా నాయకుడు పోతిరెడ్డి రమణారెడ్డి తమ నాయకుడి ఫ్లెక్సీలు వేయడానికి ఇతనికి అభ్యంతరం ఏమిటి అని ప్రశ్నించారు. న్యాయబద్ధంగా తాను ఉచితంగానే ట్యాంకర్ల ను ప్రజల అవసరార్థం వినియోగిస్తున్నా అని కానీ తనను, తన ట్యాంకర్లను అడ్డుకొనడమే కాక ఇన్చార్జి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు పోలీసులు రాత్రి సమయంలో తన గృహంపై దాడి చేయడంతో పాటు కొట్టడమే లక్ష్యంగా పెట్టుకొని ఇబ్బందులకు గురి చేశారని వాపోయారు.రాత్రి సమయంలో వైపాలెం ఎస్సై చౌడయ్య తన గృహంపై దాడి చేసి తనను దారుణంగా కొట్టడమే కాక తనను, తన కుటుంబ సభ్యులను పరుష పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ మన్నే రవీంద్ర ఫ్లెక్సీ వేయటమే తన తప్పిదమా అంటూ ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా తాను తెదేపా నాయకుడిగా మిల్లంపల్లి పంచాయితీలో బాధ్యునిగా ఉన్నానని, కానీ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్చార్జి, ఇతర పార్టీల నుండి వచ్చిన నాయకుల ఆదేశాల మేరకు తనను ఇబ్బందులు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. నాయకుడనే వారు ఇతరులకు ఆదర్శంగా నిలబడాలని, అలా కాక కేవలం స్వలాభం కోసం ఆశిస్తూ పార్టీని భ్రష్టు పట్టించడమే లక్ష్యంగా స్థానిక నాయకులు ప్రవర్తిస్తున్నారని ఇటువంటి నాయకుల పనితీరు వలన మండలంలో,నియోజకవర్గంలో భవిష్యత్తులో పార్టీకి పుట్టగతులు ఉండవని ఆయన అంటున్నారు. తనకు జరిగిన అన్యాయం విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన పేర్కొంటున్నారు. అసలు తాను చేసిన తప్పిదం ఏమిటో

## రోగులకు అంకిత భావంతో వైద్య సేవలు అందించాలి

- జిల్లా ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే కందుల



అగ్ని న్యూస్,మార్కాపురం (సెప్టెంబర్ 18): జిల్లా వైద్యశాలకు వచ్చే రోగులకు, వైద్య సిబ్బంది అంకిత భావంతో సేవలు అందించాలని శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సూచించారు. బుధవారం మార్కాపురం పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని కందుల నారాయణరెడ్డి సందర్శించి హాస్పిటల్లో ప్రతి విభాగాన్ని తనిఖీ చేశారు.

## నూతన బస్సులు ప్రారంభించి నడిపిన ఎమ్మెల్యే కందుల



అగ్ని న్యూస్,మార్కాపురం (సెప్టెంబర్ 18): మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ లో నాలుగు నూతన బస్సులను శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన బస్సు స్టార్ట్ చేసి దాదాపు 2 కిమీ దూరం నడిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 1986వ సంవత్సరంలో ఏర్పడిన మార్కాపురం ఆర్టీసీ డిపో క్రమక్రమంగా ఎదిగి ఇవాళ 103 బస్సులతో పశ్చిమ ప్రకాశం లోనే మార్కాపురం పెద్ద డిపో గా ఎదిగి ప్రజలకు సేవలు అందిస్తుందని తెలిపారు.త్వరలోనే మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చొరవ తీసుకొని ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని, వెలుగొండ

## వైసీపీ కి బాలినేని రాజీనామా!

**మొదటి పేజి తరువాయి**

(అగ్ని ప్రతినిధి, ఒంగోలు)ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పంపించారు. బాలినేని రాజీనామా వ్యవహారం ప్రకాశం జిల్లాలోనే కాదు రాష్ట్రం మొత్తం కూడా సంచలనమైంది. అయితే గత కొంతకాలంగా బాలినేని పార్టీని వీడనున్నారనే సమాచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. నేను పార్టీ మారడం లేదంటూ చెప్పుకొచ్చిన బాలినేని ఎట్టకేలకు బుధవారం తాను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు వైకాపా లో సరైన గౌరవం దక్కలేదన్నారు. అందుకే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన తర్వాత పార్టీని, జగన్మోహన్ రెడ్డి సరిగా నిర్వహించలేదని ఏం చెప్పినా పట్టించుకునే వారు కాదని ఆరోపించారు.మరల పార్టీ అధికారంలోకి వచ్చేది కష్టమే అని వ్యాఖ్యానించారు. కాగ బాలినేనిపార్టీ మార్పుపై వైకాపా లో మిశ్రమ స్పందన వచ్చింది.వైసీపీ లో దక్కని గౌరవం, గుర్తింపు జనసేనా లో దక్కుతాయా అంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

## ఆయన చెప్పారంట..! ఈయన చేశారంట.....!!

**మొదటి పేజి తరువాయి**

తెలియజేయాలని పోతిరెడ్డి అంటున్నారు... రాత్రి సమయంలో గ్రామంలో తామేదో టెర్రరిస్టులు వలె దాడులు నిర్వహించడమే కాక విచక్షణారహితంగా తమపై దాడులు చేయడం ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భవిష్యత్తులో పోలీసులు ద్వారా తనకు ప్రాణ హాని ఉందని ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

## రోగులకు అంకిత భావంతో వైద్య సేవలు అందించాలి

**మొదటి పేజి తరువాయి**


స్వయంగా తన కాలికి ఎక్స్ రే తీయించుకున్నారు.ఈ సందర్భంగా ప్రతి విభాగంలో పేషెంట్లకు అందుతున్న సేవల గురించి పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం హాస్పిటల్ స్టాఫ్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హాస్పిటల్ కమిటీ సభ్యులైన సూర పరమేశ్వర్ రెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, చక్కా మధుసూదన్ రావు, పిల్లిబోయిన పద్మావతిని హాస్పటల్ స్టాప్ కు పరిచయం చేశారు. అనంతరం స్టాఫ్ తో మాట్లాడుతూ త్వరలో వైద్యశాలకు కావలసిన అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని , వచ్చే నెలలో తిరిగి ప్రతి విభాగంతో సమావేశం నిర్వహిస్తామని అప్పటి లోపు చిన్న చిన్న లోపాలు ఉంటే సరి చేసుకోవాలని హాస్పిటల్ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి,హాస్పిటల్ స్టాఫ్,అధికారులు పాల్గొన్నారు.

## నూతన బస్సులు ప్రారంభించి నడిపిన ఎమ్మెల్యే కందుల

**మొదటి పేజి తరువాయి**

ప్రాజెక్టును పూర్తి చేసిరైతుల కళ్ళల్లో ఆనందం చూస్తానని అన్నారు.ఈ సందర్భంగా పొదిలి పట్టణానికి చెందిన సుబ్బారావు, విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి లక్ష రూపాయల చెక్కును శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సింహులు,తెలుగుదేశం నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## నూతన డిఎస్పీ ని కలిసిన బిజేపి నాయకులు




అగ్ని న్యూస్,మార్కాపురం (సెప్టెంబర్ 18): మార్కాపురం సబ్ డివిజన్ కు నూతనంగా డిఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును, బి జే పి నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పివి కృష్ణారావు మాట్లాడుతూ మార్కాపురంలో గంజాయి మత్తులో యువత చెడిపోతుందని, అదేవిధంగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండి, పాదచారులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదే విధంగా గోవులు రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నాయని,గోవుల యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకురాలు శాసనాల సరోజిని,బొంతల కృష్ణ, పైడిమర్రి శ్రీనివాసరావు, దేవిశెట్టి చంద్రశేఖర్, మొర్రిబోయిన చిన్నయ్య, మీడియా ఇన్చార్జి రామకృష్ణ, నాగరాజు, వాసవి ప్రియ, చిన్న వీరారావు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ పర్వతవర్ధని అమ్మవారికి ప్రత్యేక పూజలు

అగ్ని న్యూస్,తర్లుపాడు (సెప్టెంబర్ 18): మండలంలోని నాగెళ్ళముడుపు గ్రామంలో వెలసిన శ్రీ పర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం లో ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకులు కూనపులి ప్రసాద్ శర్మ వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం భాద్రపద పౌర్ణమి సందర్భంగా గణపతి పూజ, స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పర్వత వర్ధని అమ్మవారికి శ్రీ చక్ర సహిత నవావరణం,సహస్ర నామ కుంకుమార్చన, మహా నివేదన, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణచేశారు.కార్యక్రమాలలోపలువురుభక్తులు పాల్గొన్నారు

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :

పంతులు

మొబైల్స్

ఆర్టిసి బస్టాండ్ దగ్గర, మార్కాపురం

## ఖేల్ కూద్ పోటీలలో ఎకెవికె విద్యార్థుల ప్రతిభ



అగ్ని న్యూస్,ఒంగోలు (సెప్టెంబర్ 18) : “విద్యా భారతి” క్షేత్రస్థాయి (కర్ణాటక,తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ) లో నిర్వహించిన ఖేల్ కూద్ పోటీలలో ఒంగోలు ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వాలీబాల్ పోటీల్లో ఎకెవికె విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ కోలగట్ల వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. వీరికి కళాశాల అధ్యక్షులు మండవ నాగేశ్వరరావు, కార్యదర్శి పల్లపు చెంచు రామయ్య,ఇతర సభ్యులు అభినందనలు తెలియజేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ లో జరిగిన పోటీలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ కోలగట్ల తెలిపారు. విద్యార్థులు వారు సాధించిన గోల్డ్, సిల్వర్ మెడల్స్ తో పాటుగా ప్రశంసా పత్రాలను బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు.

## ఎస్పీ ని కలిసిన కంభం సిఐ మల్లికార్జున




అగ్ని న్యూస్,కంభం (సెప్టెంబర్ 18): సాధారణ బదిలీల లో భాగంగా కంభం సిఐగా కె.మల్లిఖార్జున నియామకం అయ్యారు. ఈ సందర్భంగా సర్కిల్ లో రిపోర్ట్ చేసుకున్న తదుపరి బుధవారం జిల్లా ఎస్పీ దామోదర్ ను,సీఐ మల్లికార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్పీ, సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, మహిళలు,పిల్లల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు, సైబర్ నేరాలపై అవగాహన, నిర్వహించాల్సిన విధులు బాధ్యతల పట్ల సిఐ కి దిశా నిర్దేశం చేశారు.

## విద్యార్థి దశ నుండే భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి



అగ్ని న్యూస్,పెద్దారవీడు (సెప్టెంబర్ 18): విద్యార్థి దశ నుంచే భవిష్యత్తు కోసం పునాదులు వేసుకోవాలి అని జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి చే ప్రశంస పత్రాలు పొందిన రాచర్ల మండలం ఎడవల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎం రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రము పెద్దారవీడు కస్తూరి భా పాఠశాల లో 2023 –2024 సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో ప్రథమ, ద్వితీయ స్థాయి పొందిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి శ్రీనివాసులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కొరకు రాంభూపాల్ రెడ్డి చేస్తున్న సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో చేసే కృషి ఉజ్వల భవిష్యత్తుకు పునాది





అగ్ని న్యూస్,తర్లుపాడు (సెప్టెంబర్ 18): విద్యార్థి దశలో చేసే కృషి ఉజ్వల భవిష్యత్తుకు పునాది అని ఎంపీడీఓ నరసింహులు తెలిపారు.మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలోని కస్తూరిబా పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహులు మాట్లాడుతు విద్యార్థి దశలో కష్టపడి విద్య పట్ల కృషి చేసిన ప్రతి ఒక్క విద్యార్థి తమ జీవితంలో ఉజ్వల భవిష్యత్ కు పునాది వేసుకోగలరు. అటువంటి పునాదులు వేసుకునే కేంద్రాలే విద్యాలయాలు అన్నారు. గత సంవత్సరం మార్చి నెలలో నిర్వహించిన పబ్లిక్ పరీక్షలలో పదవ తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరంలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మార్కాపురం రామ్ భూపాల్ రెడ్డి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు కస్తూర్బా గాంధీ విద్యాలయాలయం నందు జరిగిన కార్యక్రమంలో ఆర్థిక కారణాలతో విద్యార్థులు మధ్యలో చదువు మానుకోకూడదనే సంకల్పంతో పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తున్న మార్కాపురం రాంభూపాల్ రెడ్డి ఎంతో అభినందనీయులని కార్యక్రమానికి హాజరైన మండల అభివృద్ధి అధికారి ఎస్ నరసింహులు తెలియజేశారు. కస్తూర్బా గాంధీ కళాశాల ప్రిన్సిపల్ మారుతీ దేవి మాట్లాడుతూ విద్యారంగంలో పేద విద్యార్థులకు చేస్తున్న సేవలను ప్రధానమంత్రి గుర్తించిన రాంభూపాల్ రెడ్డి మన ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం మనకెంతో గర్వకారణమన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు, ప్రశంసా పత్రాలు రాంభూపాల్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి నరసింహులు, ప్రిన్సిపల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కలుజువ్వలపాడు సచివాలయ సిబ్బంది, కెజిబివి సిబ్బంది, మండల అభివృద్ధి అధికారి నరసింహులు రాంభూపాల్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

RK అగ్ని న్యూస్ The Power Of Truth

19 గురువారం , సెప్టెంబర్ 2024

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి కశెట్టి కొండయ్య చేయూత




అగ్ని న్యూస్,తర్లుపాడు (సెప్టెంబర్ 18): మండల కేంద్రమైన తర్లుపాడులో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 75 వజ్రోత్సవ వేడుకలలో భాగంగా పాఠశాల 1968 బ్యాచ్ విద్యార్థి,ఉన్నత శిఖరాలకు చేరి అసోసియేటివ్ ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేసిన డాక్టర్ కశెట్టి కొండయ్య, 75వేల విలువగల కంప్యూటర్స్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ బాబు కు అందజేశారు. ఈ పాఠశాలలో చదివి పాఠశాల అభివృద్ధికి సహకరించడం చాలా సంతోషంగా ఉందని, ఎంత చేసిన పాఠశాల ఋణం తీర్చుకోలేనిది అని కసెట్టి కొండయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి..వాటిని సంరక్షించాలి



అగ్ని న్యూస్,మార్కాపురం (సెప్టెంబర్ 18): మండలంలోని దరిమడుగు గ్రామ పంచాయతీలో బుధవారం సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపాల్ రెడ్డి , టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా రెండవ రోజు కార్యక్రమంలో డీఎల్డీవో సాయికుమార్ , ఎంపీడీఓ తోట చందన, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎల్డీవో సాయి కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి పర్యవేక్షణ చూడాలని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, వీఆర్వో పోతులూరి రెడ్డి , టెక్నికల్ అసిస్టెంట్ కాశి, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, సచివాలయ సిబ్బంది మహేష్, రాధాకృష్ణ, సాయి, ఏఎన్ఎం సరస్వతి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు







అగ్ని న్యూస్, మార్కాపురం (సెప్టెంబర్ 18): మార్కాపురం డిఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగరాజును తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులునిజాయితీగా, నిఖార్సుగా పని చేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. సబ్ డివిజన్లో నెలకొన్న పలు సమస్యలను ఈ సందర్భంగా ఆయన, డిఎస్పి కి వివరించారు. అనంతరం మార్కాపురం పట్టణ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సైదు బాబు ను కలిసి సత్కరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు, పలు ప్రధానమైన సమస్యలను ఎస్ఐకి ఈ సందర్భంగా మల్లికార్జున వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలంపల్లి శ్రీనివాసులు, సయ్యద్ గఫార్ ,లఘుమారపు శ్రీను, మల్లికార్జున పాల్గొన్నారు.


## ఎమ్మెల్యే కందులతో డిఎస్పి నాగరాజు భేటీ



అగ్ని న్యూస్, మార్కాపురం (సెప్టెంబర్ 18): మార్కాపురం సబ్ డివిజనల్ డిఎస్పి నాగరాజు, బుధవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారిరువురు మార్కాపురం పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. నూతనంగా డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేని కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పని చేస్తానని ఈ సందర్భంగా డిఎస్పి ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు గత ప్రభుత్వంలో అక్రమంగా నమోదైన కేసుల గురించి చర్చించారు. ప్రజలకు న్యాయం చేసే విధంగా పోలీసులు పని చేయాలని ఈ సందర్భంగా కందుల ఆకాంక్షించారు.

# ఆ విషయంలో టీడీపీ ఫెయిల్...!

(అగ్ని ప్రతినిధి,అమరావతి)
ఏపీలో వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది కూటమి ప్రభుత్వం. అయితే వంద రోజుల్లోనే కావాల్సినంత అపకీర్తి మూటగట్టుకున్నారు సీఎం చంద్రబాబు... అయితే అదంతా కేవలం సోషల్ మీడియా లోనే. అధికారంలోకి వచ్చిన తొలి రోజే ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టారు. మెగా డీఎస్సీ ప్రకటించారు.. పింఛన్‌ను రూ.వెయ్యి పెంచారు.. వివాదాస్పదమైన భూ హక్కు చట్టం రద్దు చేశారు.. రాజధాని అమరావతి ప్రాంతంలో పనులపై దృష్టి పెట్టారు. ఏపీకి జాతీయ స్థాయి ప్రాజెక్టులు రాబట్టడంలో సఫలమయ్యారు.. వీటన్నిటితో పాటు రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. ఇక విజయవాడ వరదలను సమర్థంగా ఎదుర్కొన్నారు.. బాధితులకు అండగా నిలిచారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మొదలుపెట్టనున్నారు.. పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు.. అయితే ఇవన్నీ కూడా జనాలకు తెలియకుండా మభ్య పెట్టేందుకు వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మాత్రం అడ్డుకోలేకపోతుంది కూటమి ప్రభుత్వం.ప్రస్తుతం సోషల్ మీడియా ఎంతో వేగంగా విస్తరిస్తోంది. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్, ఇంటర్ నెట్ అందుబాటులోకి రావడంతో... ప్రతి చిన్న విషయం కూడా వెంటనే తెలిసిపోతుంది. దీనినే వైసీపీ నేతలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా సరే.. ముందు దానిపై నెగిటివ్ ప్రచారం చేయడంలో మునిగిపోతున్నారు. ఉదాహరణకు రాజధాని అమరావతి ముంపు ప్రాంతమని ప్రచారం చేశారు... తర్వాత విజయవాడ కోసం రాజధానిని కాపాడారని వైరల్ చేశారు... తర్వాత అసలు అమరావతి ప్రాంతం రాజధానిగా పనికిరాదని పోస్టులు పెట్టారు.. ఇక తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై కూడా దుష్ప్రచారం చేశారు. టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుగా ప్రచారం చేశారు. చివరికి టీటీడీ జేఈవో స్వయంగా రంగంలోకి దిగి క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. వాస్తవానికి అభివృద్ధి వికేంద్రీకరణం అనేది చంద్రబాబు మాట. అందుకే 2014 ప్రభుత్వంలో రాయలసీమలో పరిశ్రమలు, ఉత్తరాంధ్రలో ఫార్మా హబ్, భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం, కోస్తాంధ్రలో రాజధాని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం వైసీపీ సోషల్ మీడియా మాత్రం... అమరావతిపై విషం చిమ్ముతోంది. కూటమి ప్రభుత్వం నిధులన్నీ అమరావతికే పెడుతోందని... ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను కనీసం పట్టించుకోవడం లేదని ప్రచారం చేస్తున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి పచ్చ మీడియా, ఈవీఎం సీఎం అంటూ కామెంట్లు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి వారిపై కనీసం చర్యలు తీసుకోవడం లేదు. ఏదో ఒకరిద్దరిని అదుపులోకి తీసుకున్నా కూడా... స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేశారు. బయటకు వచ్చిన వాళ్లు... మళ్లీ అదే పనిగా కూటమి ప్రభుత్వాన్ని, వ్యక్తిగతంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేస్తూనే ఉన్నారు. చివరికి ఆగస్టు 25 వరకు మహిళా కమిషన్ ఛైర్మన్‌గా వ్యవహరించిన వైసీపీ నేత గజ్జల వెంకటలక్ష్మి.. పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా సీటు ఖాళీ చేయడం లేదు. పైగా ముఖ్యమంత్రి పైనే వ్యక్తిగత కామెంట్లు చేస్తూ వీడియోలు పోస్టు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కూడా... కూటమి ప్రభుత్వం... ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కనీస చర్యలు తీసుకోవటం లేదు. దీంతో మహిళలపై కూడా నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారు కొందరు వైసీపీ కార్యకర్తలు.



# వాలంటీర్ లపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

(అగ్ని ప్రతినిధి, మంగళగిరి)వాలంటీర్ లపై ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ల పదవీకాలం ఏడాది క్రితమే పూర్తైతే, రెన్యూవల్ చేయలేదు. వాళ్ల పేరోల్స్ (జీతాల బిల్లులు) కూడా లేరు. వైసీపీ నేతలు చేసిన పనికి వాలంటీర్లు అనే వాళ్లు రికార్డు ల్లోనే లేకుండా పోయారు.కానీ మనం 3 నెలల జీతం ఇచ్చాం. కొందరు రాజీనామా చేశారు. చేయని వాళ్లకు ఇచ్చిన ఆర్డర్ కు కూడా గడువు ముగిసింది అని సీఎం వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్యేలు, ఎంపీలు విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలి

- సీఎం చంద్రబాబు



(అగ్ని ప్రతినిధి,మంగళగిరి) రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పు.. రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరి లోని సీకే కన్వెన్షన్‌లో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసింది, కేంద్రం నిధులను పక్కదారి పట్టించిందని విమర్శించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి వచ్చినప్పుడు ఖజానాలో ఎక్కడా డబ్బులు లేవు. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. అయినా ధైర్యంతో ముందు కెళ్తున్నాం. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పనిచేస్తున్నాం. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం అభివృద్ధి చెందదు. కేంద్ర సహాయం వెంటిలేటర్‌పై ఉన్న వ్యక్తికి ఆక్సిజన్ లాంటిది. మూడు పార్టీల సమష్టి కృషితోనే ఇంతటి ఘన విజయం సాధించాం. నా జీవితంలో ఎన్నడూ చూడని విజయమిది అని అన్నారు.151 సీట్లు ఉన్నాయని విర్రవీగిన వారు..11 సీట్లకే పరిమితమయ్యారు అదే ప్రజాస్వామ్యం" అని చంద్రబాబు అన్నారు.

## తప్పు చేసిన వాడికి శిక్ష పడాల్సిందే

కొంచెం ఆలస్యం కావొచ్చు కానీ, తప్పు చేసిన వారు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోలేరని సీఎం చంద్రబాబు అన్నారు.తప్పు చేసిన వాడికి శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు.అన్నా క్యాంటీన్ రద్దు చేసి జగన్ దుర్మార్గమైన పని చేశారని దుయ్యబట్టారు జగన్ సీఎంగా ఉన్నప్పుడే వాలంటీర్ల వ్యవస్థ గడువు ముగిసిందని, రెన్యువల్ చేయలేదని మండిపడ్డారు. వైకాపా హయాంలో తప్పులు చేసిన వాళ్లని వదిలిపెట్టను, విచారణలు జరుగుతున్నాయన్న చంద్రబాబు.. అదే సమయంలో మనం తప్పులు చేయకుండా జాగ్రత్తపడాలని స్పష్టం చేశారు.అక్టోబరు మొదటివారంలో కొత్త మద్యం పాలసీ వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వచ్చే రెండేళ్లలో పోలవరం ఫేజ్-1 పూర్తి చేస్తామన్నారు. పోలవరాన్ని పూర్తి చేసి జాతికి, రైతులకు అందిస్తామన్నారు. అమరావతికి నిధుల కొరత లేదని, ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# తిరుమల ప్రసాదం విషయంలో ఎలాంటి ప్రమాణానికైన సిద్ధం - వైవీ



(అగ్ని ప్రతినిధి, విజయవాడ)తిరుమల ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. 'కోట్ల మంది హిందువుల విశ్వాసాలను దెబ్బతీసి చంద్రబాబు పెద్ద పాపమే చేశారు అని మండిపడ్డారు.రాజకీయ లబ్ధి కోసం ఎంతటి నీచానికైనా ఆయన వెనుకాడరని మరోసారి నిరూపితమైందని సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు.ఈ విషయంలో ఆ దేవదేవుని సాక్షిగా కుటుంబంతో కలిసి ఎలాంటి ప్రమాణం చేయడానికైనా నేను సిద్ధంగా ఉన్నానంటూ ,మరి చంద్రబాబు సిద్ధమా?' అని సవాల్ విసిరారు.

## డియస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసిన పోలేపల్లి




అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 18): మార్కాపురం డిఎస్పీ నాగరాజు ని వరల్డ్ ఆర్యవైశ్య సంఘం ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రటరీ, శ్రీశైలం వాసవి సముదాయ సత్రం కార్యదర్శి పోలేపల్లి జనార్ధన్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డియస్పీ నాగరాజు ను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

## జమిలీ ఎన్నికలకు సిద్ధమైన కేంద్రం



(అగ్ని ప్రతినిధి,న్యూఢిల్లీ)ప్రధానమంత్రి నరేంద్ర మోది అధ్యక్షతన కొత్త దిల్లీలో బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్వనీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.ఇస్రో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ చంద్రయాన్-4 మిషన్ కి 2 వేల 104 కోట్లకు.. గిరిజన గ్రామాల అభివృద్ధికి 79వేల 516 కోట్లు కేటాయింపుల చేసిందన్నారు.పీఎం ఆశా పథకానికి 35 కోట్లు కేటాయింపులతో పాటు.. పోషకాల ఆధారిత సబ్సిడికీ 24వేల 475 కోట్లు కేటాయింపుల చేసిందన్నారు.యువతకు సృజనాత్మక, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.బయో మానుఫాశ్చరింగ్, బయో ఫౌండ్రీ కోసం 9వేల 197 కోట్లకు కేంద్ర ఆమోదం తెలిపినట్లు వివరించారు.వీనస్ ఆర్బిట్ మిషన్ కి కేంద్ర ఆమోదించినట్లు మంత్రి పేర్కొన్నారు.



# ఆ ఇద్దరు హీరోల మధ్య సినిమా తెచ్చిన తంటాలు...!

(అగ్ని ప్రతినిధి, విజయవాడ)





టాలీవుడ్‌లో నందమూరి, మెగా హీరోల మధ్య పోటీ తొలి నుంచి నడుస్తోంది. ఇక నందమూరి, మెగా అభిమానుల మధ్య కూడా అదే స్థాయిలో  అదే స్థాయిలో యుద్ధం నడుస్తుంది. చివరికి ఈ పోటీ కులాల మధ్య చిచ్చుపెట్టే స్థాయికి చేరుకుందనేది వాస్తవం. రెండు కుటుంబాలకు చెందిన ప్రముఖ హీరోలు బాలకృష్ణ, చిరంజీవి ఎన్నో కార్యక్రమాల్లో కలిసి పాల్గొన్నారు... ఇక వీరిద్దరి వారసులు ఎన్టీఆర్, రామ్ చరణ్ మంచి స్నేహితులు... వీరిద్దరు కలిసి నటించిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక మెగా సోదరుడు పవన్ కల్యాణ్.. నందమూరి అల్లుడు చంద్రబాబుతో కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించాడు. నందమూరి, మెగా కుటుంబాలు కలిసే ప్రస్తుతం ఏపీలో రాజకీయ చక్రం తిప్పుతున్నాయనేది కూడా వాస్తవం. అయినా సరే... అభిమానుల మధ్య ఇప్పటికీ తమ హీరోనే గొప్ప అనే పోటీ తత్వం మాత్రం పోలేదు. ఇదే విషయం మరోసారి రుజువైంది. అది కూడా ఓ సినిమా ద్వారా ఆ చిచ్చు రాజుకుంది. నార్నే నితిన్ హీరోగా నటించిన సినిమా ఆయ్. గోదావరి బ్యాక్ డ్రాప్‌లో తీసిన ఈ సినిమా మంచి కమర్షియల్ హిట్ సాధించింది. ఇక సినిమా రిలీజ్ అయిన నెల రోజుల్లోనే ఆహా ఓటీటీలో స్ట్రీమ్ అవుతోంది. బిగ్ స్క్రీన్ మీద కంటే... ఓటీటీలోనే ఆహా ఎక్కువ రికార్డులు సృష్టిస్తోంది. కామెడీ మస్తుంది అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఇదే సమయంలో ఆయ్ సినిమాలోని ఓ సన్నివేశంపై పెద్ద దుమారమే రేగుతోంది. కుల పిచ్చి పీక్స్ అంటూ చెప్పే ఓ సీన్‌లో హీరోయిన్ తండ్రి వీరయ్య వెనుక ఆదిత్య 369లో శ్రీ కృష్ణదేవరాయలు గెటప్‌లో ఉన్న బాలకృష్ణ కటౌట్ చూపించారు.. వీరయ్యకు తిరుగే లేదు అని గొప్పగా ఎలివేషన్ కూడా ఇచ్చాడు దర్శకుడు. అయితే వీరయ్యను కొట్టిన ఒకే ఒక్క మగాడు బూరయ్య అంటూ హీరో తండ్రి క్యారెక్టర్‌ను చూపించాడు. ఆయితే ఆ చూపించే సమయంలో ఖైదీ సినిమాలో చిరంజీవి కటౌట్ వేసేశాడు. ఇదే నందమూరి, మెగా అభిమానుల మధ్య చిచ్చుకు కారణమైంది. మా హీరో కింగ్ అని.. కాదు మా హీరో సూపర్ అని... సోషల్ మీడియాలో ఇప్పుడు పెద్ద దుమారం రేగుతోంది. సినిమా మీద నుంచి...క్రమంగా కులాలపై కూడా కొందరు వ్యక్తిగత కామెంట్లు చేసుకునే స్థాయికి ఈ మాటల యుద్ధం చేరుకుంది. మరి ఈ ఫ్యాన్ వార్‌కు నందమూరి, మెగా హీరోలు ఎలా బ్రేక్ చెప్తారో వేచి చూడాలి.




మార్కాపురం మునిసిపాలిటి కి మరియు తర్లుపాడు మండల
కేంద్రానికి చేరువలో ఉన్న ఏకైక ఎర్ర చందనం ఫార్మ్ ల్యాండ్ వెంచర్

మరింత సమాచారం కొరకు సంప్రదించండి
+91 9111 822 822

30 అడుగుల రోడ్లతో, మెరుగైన సదుపాయాలతో, రెండు వైపులా హైవేని
కనెక్ట్ చేసే ఆర్ & బి రోడ్లను కలిగిన ఏకైక ఎర్ర చందనం ఫార్మ్ ల్యాండ్ వెంచర్.

కంపెని డైరెక్టర్స్: మేడం సత్యనారాయణ,
దొంతిరెడ్డి వెంకటరెడ్డి, జవ్వాజి సాయికృష్ణ

## సీఐ సుబ్బారావు ను కలిసిన టీడీపీ నాయకులు



అగ్ని న్యూస్, మార్కాపురం (సెప్టెంబర్ 18): మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావును టిడిపి నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సీఐ సుబ్బారావు ను స్వాగతిస్తూ చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణం, మండలంలోని పలు సమస్యలను టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున చర్చించారు. సీఐని కలిసిన వారిలో ఆలంపల్లి శ్రీనివాసులు, సయ్యద్ గఫార్, లఘుమారపు శ్రీను, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

## బాణాసంచా విక్రేత అరెస్ట్



అగ్ని న్యూస్, గిద్దలూరు (సెప్టెంబర్ 18): ప్రభుత్వ లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వచేసి ఉన్న గోదాం పై గిద్దలూరు పోలీసులు దాడులు చేశారు. బాణాసంచా విక్రేత నిరంజన్ ను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మండలం లోని కృష్ణంశెట్టి పల్లి లో అతని ఇంట్లో రూ. 10 వేల విలువ చేసే బాణాసంచాను కూడా స్వాధీనం చేసుకున్నట్లు గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ తెలిపారు.




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)